## రోడ్లపై ఏరులై పారుతున్న డ్రైనేజీనీరు

డ్రైనేజీనీరు రోడ్లపై ఏరులై పారుతున్నది. ఆదర్శ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వివరించిన స్పందించడం లేదని వాపోతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరుకోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

- మైలార్‌దేవ్‌పల్లి

## వ్యర్థాలు వేస్తే చర్యలు

స్పెషల్ డ్రైవ్‌లో పూడికతీత పనులు చేపడుతున్న సిబ్బంది

జూబ్లీహిల్స్, అక్టోబర్ 19 : డ్రైనేజీ కాలువల్లో వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామని జలమండలి డివిజన్-6 జీఎం ఎస్. హరిశంకర్ హెచ్చరించారు. శనివారం యూసుఫ్‌గూడ సర్కిల్ జవహర్‌నగర్‌లో ‘ 90 రోజుల డీ సిల్టింగ్ స్పెషల్ డ్రైవ్’ లో భాగంగా చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించారు. భారీ యంత్రాలతో పూడికతీత చేపడుతున్నామని.. వీటిలో సిల్ట్‌కంటే ఎక్కువగా వ్యర్థాలు వస్తున్నాయన్నారు. డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాల కారణంగా సీవరేజీ ప్రవాహం రోడ్లపైకి చేరుతుందన్నారు. డ్రైనేజీ కాలువలలో వ్యర్థాలను వేస్తే ఓవర్ ఫ్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోవని.. వర్షాలు వచ్చినప్పుడు ఇది తీవ్రస్థాయికి చేరుతుందన్నారు. ఓవర్‌ఫ్లో సమస్యల పరిష్కారానికి ప్రతిఒక్కరూ సహకరించాలని.. ప్రజలు అప్రమత్తంగా ఉండి డ్రైనేజీ కాలువల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలని కోరారు.

# నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దుచేయాలి

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్

హిమాయత్‌నగర్, అక్టోబర్ 19 : రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయకుండా రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడం వల్ల యూజీసీ నిధులు వస్తాయని నూతన ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి ప్రకటించడం సరైన విధానం కాదన్నారు. ఈ విద్యావిధానం వల్ల యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే ప్రయత్నాన్ని కేంద్రం చేస్తుందని ఆరోపించారు. దేశ చరిత్ర, తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరించడంలో బీజేపీ ముందుందన్నారు. విద్యా రంగంపై నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై విద్యార్థులు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.అశోక్ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, నాయకులు ఇటికాల రామకృష్ణ, రఘురాం, గ్యార క్రాంతి, గ్యార నరేశ్, రెహమాన్, వెంకటేశ్, రాజు, లెనిన్ పాల్గొన్నారు.

### ఉపాధి అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యం

దేశంలో నిరుద్యోగ సమస్య జఠిలమవుతున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్య నిర్వహక అధ్యక్షుడు నెర్లకంటి శ్రీకాంత్ విమర్శించారు. ఈ నెల 27, 28 తేదీల్లో పెద్దపల్లి జిల్లా, గోదావరిఖనిలో జరిగే రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌కు యువత అధికసంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ వర్క్‌షాప్‌కు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరణ శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాలయాపన చేయడంతో దేశ ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగడం లేదన్నారు. ఉపాధి ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయకుండా ఏ ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించలేని పరిస్థితి ఉందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తున్న కేంద్ర విధానాలపై పోరాటాలు చేయాలని యువతకు పిలుపు నిచ్చారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నగర కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ మహమూద్, నాయకులు కల్యాణ్, వంశీ, లక్ష్మణ్, జంగయ్య పాల్గొన్నారు.

# మద్యం మత్తులో డ్రైవింగ్.. పల్టీలు కొట్టిన కారు

ప్రజాభవన్ సమీపంలో బోల్తాపడిన కారు

ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై కారు బీభత్సం

ఖైరతాబాద్, అక్టోబర్ 19 : అసలే మద్యం మత్తు, ఆపై అతివేగంతో కారు అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. ఈ ఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బేగంపేట బ్రాహ్మణవాడి శ్రీముఖి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే అక్కి వరుణ్, ఎస్ఆర్ నగర్‌లోని లీలా నగర్ శివగంగా అపార్ట్‌మెంట్‌లో నివాసించే ఎం. నరేందర్ స్నేహితులు. శనివారం ఈ ఇద్దరు కలిసి ఫుల్‌గా మద్యం సేవించి.. బంజారాహిల్స్ నుంచి లీలా నగర్‌కు కారులో బయలుదేరారు. మత్తులో కారును అతివేగంగా నడుపుతూ ప్రజాభవన్ వద్దకు చేరుకోగానే అదుపుతప్పి రోడ్డుపై పల్టీలు కొట్టి మంజీరా గెస్ట్‌హౌస్ వద్ద బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిరువురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, కారు నడిపిన అక్కి వరుణ్‌కు బ్రీత్ అనలైజింగ్ పరీక్షలో 110 ఎంజీ, నరేందర్‌కు100 ఎంజీలుగా రికార్డు తేలింది. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అతి వేగం.. ఆపై నిర్లక్ష్యం

అతివేగం.. నిర్లక్ష్యంగా నడుపుతున్న కారు ప్రమాదానికి గురైంది. ఖైరతాబాద్ పీఎస్ పరిధిలో ఘటన జరిగింది. ఎస్సై బి. అమర్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్‌కు చెందిన వికాస్‌కుమార్, సయ్యద్ షోయబ్ ఓ స్నేహితుడి వద్ద కారును తీసుకున్నారు. అర్ధరాత్రి షికారుకు బయలుదేరారు. తెల్లవారుజామున ఖైరతాబాద్ ఫ్లైవర్ మీదుగా నెక్లెస్‌రోడ్ వైపునకు వెళ్తుండగా, ఫ్లై ఓవర్ మూలమలుపు వద్ద అదుపుతప్పి ఓ సీసీ కెమెరా స్తంభాన్ని, ఆ తర్వాత పుట్‌పాత్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో ఇద్దరికి స్వల్పగాయాలు కాగా, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్లోబల్ టూరిజం అవార్డుల ప్రదానోత్సవం శనివారం రాత్రి బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్‌దక్కన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యాటక రంగంలో విశేష సేవలందిస్తున్న అనురాధ చెట్టి (హైదరాబాద్), ఎండీ మంజూర్ (థాయిల్యాండ్) రామ్ అధికారి (మాల్దీవ్స్), కాసున్ దమయంత (శ్రీలంక)కు ఉత్తమ అవార్డులను అందజేశారు.

- ఖైరతాబాద్

### అసభ్య ప్రవర్తన.. కేసు నమోదు

బంజారాహిల్స్ : అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. టోలీచౌకి అజీజ్ బాగ్ కాలనీలో హెల్త్ అండ్ గ్లో పేరుతో బ్యూటీ ప్రొడక్ట్స్ స్టోర్‌లో 12మంది యువతులు, మహిళలు ఉద్యోగం చేస్తున్నారు. 16న సాయంత్రం యాక్టివాపై గుర్తుతెలియని వ్యక్తి వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించాడు. మహిళలు గట్టిగా కేకలు వేయడంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు స్టోర్ మేనేజర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

# పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలి

ఏఎంఓహెచ్ సాల్మన్‌తో మాట్లాడుతున్న యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్

జూబ్లీహిల్స్, అక్టోబర్ 19 : పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని యూసుఫ్‌గూడ కార్పొరేటర్ బండారి రాజ్‌కుమార్ పటేల్ కోరారు. శనివారం యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో శానిటేషన్ సమస్యలపై ఏఎంఓహెచ్ డాక్టర్ సాల్మన్‌తో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకాంక్షల మేరకు పారిశుధ్య ప్రమాణాలు పెంచి స్వచ్ఛతలో ప్రథమ స్థానంలో నిలుపాలని సూచించారు. రోడ్లపై చెత్త చేరకుండా స్వచ్ఛ ఆటోలతో ఇంటింటి చెత్త సేకరణ పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో యూసుఫ్‌గూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, నర్సింగ్‌దాస్, గీతాగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

# రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేస్తుందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. రైతుబంధు రూ.15 వేలతో పాటు రైతుబరోసా కల్పిస్తామన్న కాంగ్రెస్ నాయకులు చేతులు ఎత్తివేయడంతో బీఆర్ఎస్ నాయకులు శనివారం శంషాబాద్ పట్టణంలోని జిల్లా కార్యాలయం వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నగండు రాజేందర్, వెంకట్ రెడ్డి, గుంటి చరణ్, పాడపతి పరమేశ్వరి, రాచమల్ల రమేశ్, హరికృష్ణ పాల్గొన్నారు.

- శంషాబాద్ రూరల్

# ముస్లిం శ్మశానవాటిక ఏర్పాటుపై జాప్యం చేయొద్దు

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ, ది సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు

మణికొండ, అక్టోబర్ 19: ముస్లిం శ్మశానవాటిక ఏర్పాటుపై జాప్యం చేయొద్దని మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ, ది సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు కోరారు. శనివారం మణికొండ మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ జనాబ్ జాఫర్‌అహ్మద్, ప్రెసిడెంట్ సయ్యద్ అమెర్, కార్యదర్శి జనాబ్ అక్బర్ అలీవ్వారిలు ది సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులతో కలిసి గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ఈ విషయంపై వినతిపత్రం అందజేశారు. గతంలో రంగారెడ్డి కలెక్టర్‌ను కలిసి నెక్నాంపూర్‌లోని సర్వే నం.44లో శ్మశానవాటిక నిర్మాణ పనులు చేపట్టాలని కోరామన్నారు. తహసీల్దార్‌కు వివరాలు తెలుపగా.. సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఉపాధ్యక్షులు అందె లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరీఫ్ మొహమ్మద్, సంయుక్త కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి, బొడ్డు శ్రీధర్, జనాబ్ షేక్ అల్లా బకష్, మౌలానా సలాం, షేక్ హమీద్, ముట్టంగి లక్ష్మయ్య, యాలాల కిరణ్ పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పలుబస్తీల్లో స్థానిక నాయకులతో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కార్మికనగర్ బస్తీలో చేపడుతున్న నూతన సీసీరోడ్డు పనులను పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్మాణం పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

- జూబ్లీహిల్స్

# బాల్య వివాహాలు చేయొద్దు..

అవగాహన సమావేశంలో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నిర్వాహకులు

శంషాబాద్ రూరల్ : బాల్య వివాహాలు చేయొద్దని, అవగాహన కలిగి ప్రజలందరూ సహకరించాలని బాల్య వివాహాల నిర్మూలన రంగారెడ్డి జిల్లా కో – ఆర్డినేటర్ మాధవీరెడ్డి కోరారు. శనివారం శంషాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆశ్రిత ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాధవీరెడ్డి మాట్లాడుతూ.. బాల్య వివాహాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు బాలలతో పని చేయించడంతో వారి ఎదుగుదల పూర్తిగా ఆగిపోతుందని చిన్నపిల్లలు అనారోగ్యం పాలైతారని వివరించారు. శంషాబాద్ పట్టణంలో చిన్నపిల్లలను ఎవ్వరైనా పనిలో పెట్టుకుంటే పోలీసులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు, నగ్గ గిరి, అన్నేపు ప్రభు పాల్గొన్నారు.

# ‘ఆలయాల జోలికి వస్తే ఊరుకునే దిలేదు’

శంషాబాద్ పట్టణంలో ఆందోళన చేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 19 : ఆలయాల జోలికి వస్తే ఊరుకునేదిలేదని శంషాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్ హెచ్చరించారు. శనివారం హిందువుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శంషాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. దుర్గామాత అమ్మవారి చేయి విరగ్గొట్టిన దుండగులు, సికింద్రాబాద్‌లోని ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో కౌన్సిలర్ మేకల వెంకటేశ్, నాయకులు జంగయ్య, జ్ఞానేశ్వర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# పేదల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, అక్టోబర్ 19 : పేదల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయదేవి డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ నగర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బడా కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇస్తూ సామాన్య ప్రజలపై కేంద్రం భారం మోపుతుందని విమర్శిం చారు. 2014 నుంచి ఇప్పటివరకు మోదీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడంతో పాటు సంక్షేమ ఫలాలను అందించలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## చిట్టిబుర్రల్లో గట్టి ఆలోచనలు



వెంగళరావునగర్ : చిట్టిబుర్రల్లో గట్టి ఆలోచనలు మెదిలాయి.. సృతనాత్మకకు పదువు పెట్టారు. దసరా, రంజాన్, క్రిస్మస్ వంటి పండుగలతో పాటు పోలీస్‌స్టేషన్, దవాఖాన, పోస్టాఫీస్ నమూనాలు తయారు చేశారు. ప్రీప్రైమరీ వారి కోసం శనివారం ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్ నగర్‌లోని శ్రీసాయి జాస్మిన్ హైస్కూల్‌లో ఫెస్టివల్ ఆఫ్ వైట్స్ నిర్వహించారు. పాఠశాల చైర్మన్ పి.జగన్నాథం, హెచ్ఎం యు.విజయలక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆలంబాగ్ పోలీసులమంటూ బురిడీ..

**దంపతులను బెదిరించి రూ.40 వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు**

వెంగళరావునగర్, అక్టోబర్ 19 : సైబర్‌నేరగాళ్లు.. ఏకంగా పోలీస్ యూనిఫామ్‌తోనే వాట్సాప్ వీడియో కాల్‌చేసి.. ఆధారుకార్డు దుర్వినియోగం చేశారంటూ దంపతులను బెదిరించి.. రూ.40వేలు కాజేశారు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన అకౌంటెంట్ రాజు కనుగంటి, పూజ దంపతులకు ఓ ఫోన్‌కాల్ వచ్చింది. తాము ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆలంబాగ్ క్రైం బ్రాంచ్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐను మాట్లాడుతున్నానని.. వెంటనే వీడియో కాల్ చేస్తానని కాల్‌లిఫ్ట్ చేయాలని చెప్పారు. వీడియో కాల్‌ను లిఫ్ట్ చేయగా.. తాము ఎస్ఐ, డీఎస్పీలమంటూ పరిచయం చేసుకున్నారు. మీరు.. ఆధార్‌కార్డ్‌ను దుర్వినియోగం చేశారని..మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని బెదిరించారు. వెంటనే రూ.40 వేలు పంపాలని..లేకుంటే భార్యాభర్తలిద్దర్నీ అరెస్ట్ చేయాల్సి ఉంటుందని బెదిరించారు. భయపడిపోయిన ఆ దంపతులు రూ.40 వేలు పంపారు. ఆ తర్వాత మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు దర్యాప్తు చేపట్టారు.

# వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద హైడ్రా పరిశీలన

నగరంలో వాటర్ లాగింగ్ పాయింట్లను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్

సిటీబ్యూరో, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో వరద నీరు నిలుస్తున్న ప్రాంతాలతో పాటు ట్రాఫిక్ స్తంభిస్తున్న ప్రాంతాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్, నగర ట్రాఫిక్ విభాగం అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, జీహెచ్ఎంసీ అధికారులతో శనివారం కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లక్డీకాపూల్, రాజ్ భవన్ ప్రాంతాల్లో వాటర్ లాగింగ్ పాయింట్లను తనిఖీ చేసి వరద ముప్పు లేకుండా తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. శిథిలమైన వరద కాలువలను వారం రోజుల్లో పునరుద్ధరించాలని, వరద ముప్పు తప్పని పరిస్థితుల్లో ఈ వర్షాకాలానికి తాత్కాలిక చర్యలు చేపట్టి, వచ్చే వేసవిలో కాలును విస్తరించాలని సూచించారు. రాజ్‌భవన్ రోడ్డులో ఐదు సెంటీ మీటర్ల కంటే ఎక్కువ వర్షం పడితే చేపట్టాల్సిన చర్యలతో పాటు ఇం జన్లు పెట్టి నీటిని తోడించేందుకు ఉన్న అవకాశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నగరంలోని ప్రధానమైన 30 వాటర్ లాగింగ్ ప్రాంతాల ముప్పును మొదట తొలగించడానికి అధికారులు నిర్ణయించారు.

# అత్యవసరంగా ఇంజక్షన్లు కావాలని మోసం

బంజారాహిల్స్ : అత్యవసరంగా ఇంజక్షన్లు డోర్ డెలివరీ కావాలంటూ ఫోన్‌చేసి డబ్బులు ఇవ్వకుండా ఓ వ్యక్తి ముఖం చాటేశాడు. ఈ ఘటన ఫిలింనగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. గుడిమల్కాపూర్ ప్రాంతానికి చెందిన పల్లె రమేశ్.. టోలీచౌకి సమీపంలోని అపోలో ఫార్మసీలో ఫార్మసీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 17న గుర్తుతెలియని వ్యక్తి రమేశ్‌కు ఫోన్‌చేసి తనకు అత్యవసరంగా కొన్ని ఇంజక్షన్లు కావాలంటూ ఆర్డర్ ఇచ్చాడు. స్థానికంగా పాస్‌పోర్ట్ ఆఫీస్ సమీపంలోకి వచ్చి తనకు బిల్లుఇస్తే రూ.21,896 అక్కడే చెల్లిస్తానని నమ్మించాడు. వెంటనే రమేశ్.. ఆ మెడిసిన్ తీసుకుని అక్కడికి వెళ్లగా.. గుర్తు తెలియని వ్యక్తి మందులు, బిల్లు తీసుకుని పక్కనే ఉన్న మెక్‌డోనాల్డ్ బిల్డింగ్‌లోని మూడో ఫ్లోర్‌కు వచ్చి డబ్బులు తీసుకోవాలని చెప్పాడు. అతడి వెంట వెళ్తుండగా కొందరు వచ్చి రమేశ్‌ను అడ్డుకుని దృష్టి మళ్లించారు. ఆ తర్వాత బిల్డింగ్ మూడో ఫ్లోర్‌కు వెళ్లి చూడగా అక్కడ ఎవరూ కనిపించలేదు. దీంతో మోసం చేశారని గుర్తించిన బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గదుల నిర్మాణం హర్షణీయం

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న జనసేన పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి శంకర్‌గౌడ్

ఖైరతాబాద్, అక్టోబర్ 19 : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొండగట్టు దేవస్థానంలో 100 గదుల నిర్మాణానికి చొరవ తీసుకోవడం హర్షణీయమని జనసేన పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి శంకర్ గౌడ్ తెలిపారు. శనివారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో వీటి నిర్మాణం చేపడుతున్నారని, అశేష సంఖ్యలో వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలతో గదులను నిర్మించాలని పవన్ కల్యాణ్ సంకల్పించం గొప్ప విషయమన్నారు.

# గురుకుల ప్రైవేట్ భవనాల కిరాయిలు పూర్తిగా చెల్లించండి

ఖైరతాబాద్, అక్టోబర్ 19 : ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు సంబంధించిన కిరాయి బకాయిలు పూర్తిగా చెల్లించాలని ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేట్ భవన యజమాన్య సంఘం అధ్యక్షుడు ఎ. దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో సంఘం గౌరవ సలహాదారులు డాక్టర్ కొండా దేవయ్య పటేల్‌తో కలిసి మాట్లాడారు. కిరాయి బకాయిలు చెల్లించాలని కోరిన పలువురు యజమానులపై కేసులుపెట్టారని వెంటనే వాటిని ఉపసంహరించాలన్నారు. భవనాల కిరాయి వ్యవధికి మూడేండ్ల కనీస వ్యవధితో కూడిన సరైన అగ్రిమెంట్ ఉండాలన్నారు. కిరాయి రేటు స్థిరీకరణ చేసి జిల్లా, కార్పొరేషన్ పరిధిలో కనీసం రూ.30, మున్సిపాలిటీ, మండల స్థాయిలో రూ.25 పెంచాలని, ప్రతి రెండేండ్లకు 20 శాతం పెంపుదల చేయాలన్నారు. ఆట స్థలాలకు ఫీటుకు రూ.10 చొప్పున చెల్లించాలని, నిర్వహణ భారం ప్రభుత్వమే భరించాలన్నారు. జీఎస్టీతో కూడిన కిరాయి వ్యవస్థను అమలు చేయాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందించగా, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి బండి కుమారస్వామి, కోశాధికారి శంబారెడ్డి, శ్రీహరి, జోగి రెడ్డి, శరత్ కుమార్, గోపాల్ రెడ్డి, ఏవీఎం రెడ్డి, సత్యం గౌడ్ పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులు చేపట్టాలి

వెంకటేశ్వరకాలనీ పరిధిలోని ప్రతాప్‌నగర్ బస్తీలో పెండింగ్‌లో ఉన్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణాన్ని చేపట్టాలని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కోరారు. శనివారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతాప్‌నగర్ బస్తీలో ప్రతిపాదించిన మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణాన్ని ప్రారంభించాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

- బంజారాహిల్స్

## ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్తు హెచ్చరించారు. శనివారం ఔటర్‌రింగ్ రోడ్డుకు అనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేయడానికి యత్నిస్తూ భూమిని చదును చేసుతున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందికి పంపించి అక్కడ బోర్డులు ఏర్పాటు చేయించారు. బోర్డు తొలగించిన భూమిని చదును చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

- శంషాబాద్ రూరల్

## రెండోరోజూ.. ఆక్రమణల తొలగింపు

హిమాయత్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు రెండోరోజు కొనసాగాయి. శనివారం నారాయణగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ నేతృత్వంలో నారాయణగూడ నుంచి కింగ్‌కోఠి వరకు ఫుట్‌పాత్‌లపై ఉన్న పలు దుకాణాలను తొలగించారు.

- హిమాయత్ నగర్